శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సరస్వతీ ఆలంకారంలో సింహవాహనంపై నృసింహునికి క్షేత్రోత్సవం



**పెంచలకోన(రాపూరు),మే 3ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారికి నిర్వహిస్తున్న బ్రహ్మో త్సవాల లోబాగంగా రెండవ రోజైన బుదవారం ఉదయం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి సరస్వతీ ఆలంకారంలో హంసవాహనంపైభక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి పూలాంగీ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని సరస్వతీదేవి ఆలంకారంలో హంస వాహనంపై వుంచి కోనలోని మాఢ వీధులలో వైభవంగా క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆస్థానమండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు పాలు ,పేరుగు,నెయ్యి ,తేనే,పసుపు, కుంకుమ,చందనం, పలురకాలైన పండ్లరసాలు,సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం (అభిషేకం)నిర్వహించారు.పెద్ద ఎత్తున భక్తులు ఈ



కార్యక్రమంలో పాల్గోని హంస వాహనంపై సరస్వతీ ఆలంకారంలోవున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,సహాయక కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, ప్రధానార్చకులు గుండ్లూరు సీతారమయ్య స్వామి, పెంచలయ్య స్వామి,అర్చక స్వామలు శశిస్వామి, మధు స్వామి, వేదపండితులు త్రినాద్ స్వామి, నాగరాజు స్వామి, తదితరులున్నారు.

## కందుకూరు డిఎస్పీగా రామచంద్ర



కందుకూరు,మే3,ప్రభాతవార్త కందుకూరు డిఎస్పీగా ఎ.రామచంద్ర నియమితులైయ్యారు.ఆయన బుధవారం డిఎస్పీ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.అనంతరం స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డిని మర్యాదపూరవ్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిజేశారు.ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ జి.వెంకట్రావు,గుడ్లూరు సిఐ సుబ్బారావు, పట్టణ ఎస్సై హనీఫ్ పాల్గొన్నారు.

# సియం జగన్ సభ ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలు కసరత్తు !



**కావలి, మే 3 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 12వ తేది కావలిలో పర్యటిస్తున్న సందర్భంగా బుధవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు తదితర అధికారులతో ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని సందర్శించారు .హెలిప్యాడ్, బ్యారికేడింగ్ ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలు ఆర్‌అండ్‌బి, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఉదయగిరి రోడ్డులోని మినీ క్రీడా స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు అందజేశారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి జవహర్ భారతి కళాశాల, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్థలాలను పరిశీలించారు. ఆర్టీసి డిపోకు సంబంధించిన ఖాళీ స్థలాన్ని కూడా పరిశీలించారు.ముఖ్యమంత్రి ఏర్పాట్ల మ్యాప్ పరిశీలించి చర్చించారు. మీడియాతో మాట్లాడేందుకు జిల్లా కలెక్టర్ అవకాశం ఇవ్వకపోగా కొద్దిపాటి సీరియస్ ప్రదర్శించారు. దీంతో పాత్రికేయులు వెనుతిరగాల్సి వచ్చింది.జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల వెంట అడిషినల్ ఎస్పీ హిమవతి, కావలి ఆర్డీవో శీనానాయక్, డిఎస్పీ వెంకట రమణ, జెడ్పీ సిఇవో చిరంజీవి, ఆర్ అండ్‌బి, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇలు వెంకట సుబ్బయ్య, గంగాధర్, డిటిసి చందర్, డివిజనల్ అభివృద్ధి అధికారిణి కనకదుర్గాభవాని, కావలి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కావలి ఎలక్ట్రికల్ డిఇ విజయ్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ మాధవరెడ్డి, వివిధ శాఖల అధికారులు,వైసిపి నేత, ప్రముఖ రియల్టర్ జనిగర్ల మహేంద్ర యాదవ్, వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జంపాని రాఘవులు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, పందిటి కామరాజు, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కనమర్లపూడి వెంకట నారాయణ, కనపర్తి రాజశేఖర్, గుడ్లూరు మాల్యాద్రి,వడ్లమూడి వెంకటేశ్వర్లు, నాయుడు రాంప్రసాద్ తదితర వైసిపి నేతలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# గృహరుణమేళాలో పాల్గొన్న కమిషనర్ వికాస్ మర్మత్



**నెల్లూరు కార్పొరేషన్,మే3,ప్రభాతవార్త** జగనన్న కాలనీ లబ్ధిదారులకు గృహ రుణాలు అందించేందుకు నిర్వహించిన రుణమేళాలో నెల్లూరునగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.స్థానిక వెంకటేశ్వరపురం జగనన్న కాలనీలో బుధవారం ఉదయంజరిగిన రుణమేళాలో 3,9,14,45 డివిజన్లకు చెందిన సుమారు 150మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూఫ్ నిర్మాణం పూర్తయిన గృహాలకు పొదుపు పథకం ద్వారా మరో 35వేల రూపాయల రుణాన్ని వడ్డీ లేకుండా అందించనున్నామని,ఆ మొత్తంతో ఫినిషింగ్ పనులను పూర్తి చేసి గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు.అదేవిధంగా స్థానిక కాలనీ నిర్మాణల నుండే ప్రజలకు అందుబాటులోఉండేలా బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామని కమిషనర్ వెల్లడించారు.విద్యుత్తు,వీధి దీపాలు,మంచినీరు,డ్రైన్లు,రోడ్డు మార్గాలు వంటి మౌళిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించనున్నామని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ,డిఈ,ఏఈలు,మెప్మా విభాగం అధికారులు, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కామ్యమైన కోర్కెలు తీర్చే కల్పవల్లి కామాక్షితాయి

### శ్రీశంకర విజేయంద్ర సరస్వతీస్వామి స్వహస్తాలతో మహాకుంబాభిషేకం





**బుచ్చి మే 3 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో జరుగుతున్న మహాకుంబాభిషేక వేడుకలలో భాగంగా బుధవారం ప్రాతః కాల సమయమందు మహాకుంభాభిషేకం (శిఖర సంప్రోక్షణం) కంచికామపీఠాధిపతులు శ్రీశంకర విజేయంద్ర సరస్వతీస్వామి స్వహస్తాలతో నిర్వహించారు. ఆగమశాస్త్రనియమాలతో సప్తనదుల జలాలతో అర్చకులు,బుత్వికులు వేద మంత్రోచ్చరణ నడుమ మహాకుంభాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.దేవత యొక్క ఆద్యాత్మి శక్తులను ఆవాహనం చేశారు. మహాకుంభాభిషేకం జలాలు చల్లించుకుంటే పాపపరిహారం జరిగి సకల శుభాలు జరుగుతాయని స్వామి తెలిపారు.వేకోజామునుండే భక్తులు పోట్టేత్తారు. కంచికామకోటి పీఠాదిపతులు శ్రీ శంకర విజేయంద్ర సరస్వతీ స్వామి భక్తులకు నుద్దేశించి మాట్లాడుతు కామ్యమైన కోర్కెలు తీర్చె కల్పవల్లి శ్రీ కామాక్షితాయి అని స్వామి వివరించారు.కామాక్షితాయి సౌందర్యలహరి అని ,కామాక్షి అనే మూడు అక్షరాలు చాలా విశిష్టమైనవని స్వామి వివరించారు.గాలిగోపురంకి,గర్భగుడిపైన సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఛైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు మహాకుంభాబిషేకం ఉభయకర్తలు రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ప్రశాంతిరెడ్డి,కొలన్‌రాజారెడ్డి,పూజతమ్మ దంపతులు ధన్యజీవులని ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించారని వారి దాతృత్వం అభినందనీయమని అన్నారు.కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఆలయంలో ఈ కార్యక్రమాలన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మనమరాలు రూపంలో కామాక్షితాయి పుట్టిందని కొన్ని అని వార్యకారణాల కారణంగా ఆయన ఈ కార్యక్రమంలో పాల్గోనలేకపోయాడని ఛైర్మన్ పుట్టా తెలిపారు.మహాకుంభాభిషేకం కార్యక్రమానికి ఆయన రానందును కొంత లోటుగానే వుందని అన్నారు. ఆలయం మొత్తం అత్యంత సుందరంగా పూలతోరణాలతో అలంకరించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు


**శభాష్ బుచ్చి పోలీస్** మహాకుంభాభిషేకం సమయంలో ఎస్ఐ వీరప్రతాప్ నేతృత్వంలో ముగ్గురు ఎస్ఐలు,ఎఎస్ఐలు,కానిస్టేబుల్స్ ,మహిళా పోలీసులు భక్తులను ఎవ్వర్ని ఇబ్బంది పెట్టకుండా ప్రతి ఒక్కర్ని ఎంతో ఓర్పుతో చెబుతు అందరికి కామాక్షితాయి దర్శనం దొరికేలా చేశారు.పెద్ద ఎత్తున భక్తులు పాల్గోన్నపట్టికి మ హిళా పోలీసులు వ్యవహరించిన తీరుకి అందరు శభాష్ బుచ్చి పోలీసులు అంటు కితాబు ఇచ్చారు.

**మహాకుంబాభిషేకంలో పాల్గోన్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ** మహాకుంభాభిషేకంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళీ దంపతులు పాల్గోన్నారు.కుంభాభిషేక కార్యక్రమం అనం తరం అమ్మవారిని దర్శించుకున్నారు.

**పాలక మండలి సేవలు ప్రశంసనీయం** గత ఏడు రోజుల నుండి మహాకుంభాభిషేకం కార్యక్రమంలో నిద్రహారాలు మానుకొని పాలక మండలి సభ్యులు చైర్మన్‌కు ఎంతో సహాయసహాకారాలు అందించారు. ఒక్కోక్క పాలక మండలి సభ్యుడు ఒక్కోక్క కార్యక్రమాన్ని తమ భుజస్కందాలపైన వేసుకొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఆలయ ఇఒ డబ్బుగుంట వేంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్,తిరుమూరు సుప్రజ,గుమ్మ రఘురామయ్య, ఆములూరు విమలమ్మ, గుంటూరు కామేశ్వరీ,బట్టేపాటి విజయమ్మ,ముంగర శివకుమార్, కాగొల్లు పద్మ, ఎక్స్ అఫిషియా సభ్యులు ఎస్ శశిశేఖర్‌శర్మ, అందరు ఈకార్యక్రమానికి విశేష సేవలు అందించారని చెప్పవచ్చు.

**అర్చకుల పాత్ర** కీలకం గత 7 రోజుల నుండి నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం కార్యక్రమాలలో అర్చకులు ఎంతో కీలక పాత్ర వహించారు.ప్రతి విషయాన్ని అత్యంత జాగ్రత్తగా యజ్ఞ,యాగాలు,పూజలు నిర్వహించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు.వేలమందికి తీర్ధ ప్రసాదాలు సంతృప్తికరంగా అందించారు.

## చుక్కల భూముల విషయమై జిల్లా కలెక్టర్‌తో వేమిరెడ్డిభేటీ




నెల్లూరు అర్బన్,మే3,ప్రభాతవార్త రాజ్యసభ సభ్యులు,వైసీపీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి చుక్కలభూముల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవోనెం163లో తొలగించబడిన చుక్కల భూముల వివరాలను జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్టర్ కార్యాలయాల్లోని నిషేదపుజాబితాల నుండి తొలగించుటకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఈ విషయమై ఇప్పటికే జిల్లా రిజిస్టర్ సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు.తొలగించినవలసిన చుక్కల భూములు సుమారు 31960ఎంట్రీలలో ఇప్పటివరకు 20981ఎంట్రీలు,అధికారులు నిషేదపు జాబితా నుండి తొలగించారని మిగిలిన ఎంట్రీలు తొలగింపుకార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందని తెలిపారు.తొలగించిన భూముల వివరాల జాబితాలను ప్రజలకు సమాచారం నిమిత్తం అన్ని రెవెన్యూ కార్యాలయాలలో త్వరలో ప్రచురిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ చర్యల్లో జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ జనరల్ ఫండ్స్ ద్వారా నిధులు విడుదల



**నెల్లూరు అర్బన్,మే3 ,ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు బూడిద విజయ్‌కుమార్ అధ్యక్షతన నెల్లూరు రూరల్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలకు జిల్లా ప్రజాపరిషత్ నిధులు 15వ ఆర్ధిక సంఘం నిధుల నుండి 24పనులకు గాను 2కోట్ల 82లక్షల 75వేల రూపాయలు,మండలంలోని వివిధ గ్రామాలలో పనుల కొరకు జిల్లా పరిషత జనరల్ ఫండ్స్ నుండి 6పనులకు గాను 30,40,000రూలను మంజూరుచేయడమైందన్నారు.అన్నిశాఖల గ్రామస్థాయి,మండలస్థాయి అధికారులందరూ ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసు కుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మన నెల్లూరు రూరల్ మండల అభివృద్ధికి జిల్లా ప్రజాపరిషత్ తరుపున చైర్‌పర్సన్‌గా మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మనవి చేసుకుంటున్నానన్నారు.ఈసమావేశంలో ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు,మండలస్థాయి నాయకులు,మండలపరిషత్ అభివృద్ధి అధికారి ,అన్నిశాఖల మండల స్థాయిఅధికారులు పాల్గొన్నారు.

# రామావతారంలో బంగారు హనుమంత వాహనంపై పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి



**పెంచలకోన(రాపూరు),మే 3ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారికి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలోబాగంగా రెండవ రోజైన బుదవారం సాయంత్రం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి రామావతారంలో బంగారుహనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో బాగంగా సాయంత్రం స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తుల నుపలు రకాలైన పుష్పాలతో శోభాయమానంగా ఆలంకరించి తిరుచ్చిపై వుంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించి,తిరుచ్చిపైస్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు స్వామి వారి సహస్ర దీపాలంకరణ మండపంలో వుంచి 1008 దీపల మద్య ఊయలపై వుంచి స్వామి,అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వేదపారాయణనిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటలకు స్వామి వారిని పలురకాలైన పుష్పాలతో ఆలంకరించి రామావతం చేసి బంగారు హనుమంత వాహనంపై వుంచి మంగళవాయిద్యాలు,భాజా భజంత్రీలమద్య,భక్తుల గోవింద నామస్మరణలతో కోనలో వైభవంగా క్షేత్రోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలోపాల్గోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. స్వామి వారి బంగారు హనుమంత వాహన సేవ దృశ్యాఎటువంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా రాపూరు సిఐ కోటేశ్వర రావు, ఎస్ఐ కాంతి కుమార్‌లు భద్రతాఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఇఒ కె.జనార్ధన్ రెడ్డి, పలువురు పాలకమండలి సభ్యులు పాల్గోన్నారు. స్వామి వారి ఈ పూజా కార్యక్రమాలకు ఉభయ కర్తలుగా కడప జిల్లా ,అబ్బనపల్లి గ్రామానికి చెందిన కోమ్మినేని ధనుంజయ రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు గుండ్లూరు సీతారమయ్య స్వామి, పెంచలయ్యస్వామి, అర్చక స్వామలు శశి స్వామి, మధుస్వామి, వేదపండితులు త్రినాద్ స్వామి, నాగరాజు స్వామి,తదితరులున్నారు.

**నేడు నృసింహ జయంతి** స్వామి వారికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో బాగంగా గురువారం నృసింహ జయంతి సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు పూలాంగి సేవ, ఉదయం సింహ వాహన సేవ, రాత్రి బంగారు గరుడ సేవ నిర్వహించనున్నారు.

## నాలుగవ రోజుకు చేరిన నరసింహస్వామి బ్రహోత్సవ వేడుకలు



**నెల్లూరు,మే3,ప్రభాతవార్త** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రూరల్ మండలం నరసింహస్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహోత్సవాలు సందర్భంగా 4వ రోజు ఉదయం చప్పర ఉత్సవం,రాత్రి నరసింహవాహన సేవ కార్యక్రమాలు ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు గారి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగాయి.చప్పరఉత్సవం ఉభయ కర్తలుగా బసిరెడ్డి విజయ్ కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి ,కుటుంబ సభ్యులు,రాత్రి సింహవాహన సేవకుఉభయ కర్తలుగా నెట్టం చిరంజీవి ,భాస్క ర్,రాజారావు గార్లు వ్యవహరించగా పూజ కార్యక్రమాలులో ప్రత్యేకఉత్సవ అధికారి ఆర్‌కె చైతన్య,ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి,కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ,ధర్మకర్తలు మండలి సభ్యులు అల్లూరు దినేష్‌కుమార్,నెట్టం రఘురామయ్య,పామూరు మల్లికార్జునరెడ్డి,రాపురు అంజయ్య,మడపాకుల జయమ్మ,సుంకర మస్తానమ్మ,వినుకోట ప్రసన్నలక్ష్మీ,ఇండ్ల లక్ష్మమ్మ,అర్చక సిబ్బంది పాల్గొన్నారు.కురిమి అనుఘచెన్నై వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన,శ్రీ లక్ష్మీ చెన్నకేశవ మండలిచే గయోపాఖ్యానము యుద్దము శ్రీను భక్తులను ఆకట్టుకున్నాయి.

# మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష



నెల్లూరు అర్బన్,మే3,ప్రభాతవార్త స్పందనలో వస్తున్న అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని,ప్రజా సమస్యలకు సంబంధించి వచ్చే అర్జీలు మళ్లీ పునరావృత్తం అయితే సహించేది లేదని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను హెచ్చరించారు.బుధవారం సాయంత్రం స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంపై జిల్లా, మండలస్థాయి అధికారులతో ఆర్‌అండ్‌బి అతిధిగృహం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష చేశారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు.స్పందనలో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కారం చూపించాలని ఆయన అన్నారు.స్పందన సమస్యల పరిష్కారంలో జిల్లా అధికారులు,మండలస్థాయి అధికారులే పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ అన్నారు.గతవారం కంటే ఈ వారం రీఓపెన్ కేసులు పెరగాయని అందువల్ల జిల్లా అధికారులందరూ జాగ్రత్తగా ఉండి సమస్యలు సమస్యలు పరిష్కరించాలనిసూచించారు. రెవెన్యూ,పౌరసరఫరాలు,పంచాయతీరాజ్,మున్సిపల్,పోలీస్ శాఖలకు సంబంధించి పిటీషన్లు వస్తున్నందున ఆ శాఖల అధికారులు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నందున అధికారులందరూ స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్‌పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్,డిఆర్ఓ వెంకటనారాయణమ్మ,డిఆర్‌డిఎ పిడిసాంబశివారెడ్డి,వివిధ శాఖల అధికారులు తిక్కన మీటింగ్ హాల్ నుండి వి.సిలో పాల్గొన్నారు.

# మహిమాన్వితుడు మాలకొండలోని లక్ష్మీనరసింహస్వామి



## ఈ నెల 6న స్వామివారి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం





**వలేటివారిపాలెం మే 3 ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలంలో మాలకొండ నందు నరనారాయణుల్లో ఒకరైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి లక్ష్మీఅమ్మవారితో సతీ సమేతంగా మహిమాన్వితుడై కొలువు తీరియున్నారు. తమ తమ మనోరథములు ఫలించునిమిత్తం వేలాది మంది భక్తులు ప్రతిశనివారం మాలకొండ వచ్చి స్వామివారిని మనోనిష్టతో పూజిస్తుంటారు. దేవాదాయశాఖ అధికారులు భక్తుల ఏర్పాట్లును పర్యవేక్షిస్తుంటారు. "ప్రతి ఏడాది వైశాఖశుద్ధ చతుర్దశి స్వామివారి జయంతి. అయితే జయంతి సమీపంలోని శనివారం మాలకొండలో నరసింహ జయంతిని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆ రోజు స్వామివారిని చిత్తశుద్ధితో పూజిస్తే తమ తమ కోరికలు ఖచ్చితంగా తీరతాయన్న నమ్మకం భక్తుల్లో అధికంగా ఉంటుంది. జయంతి రోజు భక్తులు అధిక సంఖ్యలో మాలకొండకు హాజరవుతుంటారు. ఇందులో బాగంగానే ఈ నెల 6వ తేదీన స్వామి వారి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయకమీషనర్ కె.బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కందుకూరు శాసన సభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు మానుగుంట మహీధర్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. జయంతి సందర్భంగా స్వామివారి మహిమను తెలియపరిచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ జయంతి ఉత్సవాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన భక్తులకు సూచించారు.

**మాలకొండలో స్వామివారు ఎలా వెలిశారంటే...** ఒకానోక సందర్భంలో లోకమాత శ్రీమహాలక్ష్మీ శ్రీమన్నారాయణ స్వా మి వారితో ఇలా అన్నారట....స్వామీ భూలోకంలో జనులకుది వ్యక్షేత్రం అందుబాటులో లేక, మోక్షమార్గం తెలియక జనన మరణ సంసారంలో గిర్రున తిరుగుతూ బాధలు పడుతున్నారని, కలియుగంలో దైవనామోచ్చరణ చేస్తేనే సర్వపాపములు పటాపంచలై ముక్తిమార్గం సులభతరమవుతుందని, అందుకు అవసరమైన దివ్యక్షేత్రాన్ని ప్రసాదించమని కోరినట్లు స్థలపురాణం చెపుతుంది. అమ్మవారి కోరిక మేరకు దివ్యక్షేత్రం ఏర్పాటుకు స్వామివారు అంగీకరించారట. తన ఇష్టసఖియైన 'వనమాల'ను భూలోకంలో సుందరమైన పర్వతంగా రూపుదాల్చమని ఆజ్ఞాపించారట. దీంతో వనమాల మాలకొండ ప్రాంతంలో 'మాల్యాద్రి'గా ప్రకృతి సౌందర్యంగా రమణీయతతో రూపాంతరం చెందిందట. తదుపరి స్వామివారు అమ్మవారితో కలిసి నరసింహస్వామిగా రూపాంతరం చెంది ఒకచేత సుదర్శన చక్రం, మరొకచేత శంఖం, ఇంకొక చేయిచుట్టి శ్రీమహాలక్ష్మిని తొడపై కూర్చొండ బెట్టుకొని, భక్తజనులుకు అభయమిస్తూ మాలకొండలో వేంచేసినట్లు స్థలపురాణం చెపుతుంది.

**మాలకొండ ప్రత్యేకతలు: ప్రకృతి సౌందర్యం:** మాలకొండలో ప్రకృతి సౌందర్యంకు కొదువలేదు. పెద్దపెద్ద బండలు. ఆ బండలపై నిత్యం పచ్చని చెట్లు. చిన్న ఆదారంతో నిలిచిన గొడుగు బండ ప్రత్యేకత చూస్తే గానీ తీరదు. అమ్మవారి ఆలయమార్గంలో పెద్ద బండ రెండుగా చీలిన మెట్లదారి. ఎంతటి లావుపాటి వారికైనా ఈ దారిన గల మెట్లు ఎక్కిపోవడానికి అనువుగా ఉంది. ఆలయ ప్రాంగణంలో ఒకప్పటి గుహల. లోయల ఆనవాళ్లు. ఒకటేమిటి లెక్కలేనన్ని వింతలు. విశేషాలు.

**మహిమాన్వితుడు మాలకొండస్వామి:** శ్రీ మాల్యాద్రిలక్ష్మీ నరసింహాస్వామి మహిమాన్వితుడుగా ప్రతీక. స్వామివారిని మనోనిష్ఠతో పూజిస్తే తమ తమ కోరికలు నెరవేరతాయన్న నమ్మకం భక్తుల్లో అధికంగా ఉంది. అదీ స్వామవారి జయంతి నాడు పూజిస్తే ఫలితం అమోఘంగా పలువురు చెపుతుంటారు. ఇందులో బాగంగానే తరతరాలుగా భూపతులెందరో స్వామివారిని సేవించినట్లు స్థలపురాణం చెపుతుంది. విజయనగరప్రభువగు అచ్యుతరాయలు, రెడ్డిరోజులు, చుండి సంస్థానాధీశులు, స్వామివారిని పూజించి పునీతులైనట్లు సమాచారం. అదేవిధంగా కేంద్రరాష్ట్రమంత్రులు, న్యాయమూర్తులు, ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజకీయ, సినీరంగ ప్రముఖులు తరచూ స్వామివారిని పూజించడం గమనార్హం.

**లక్ష్మక్కపేట ప్రత్యేకత:** మాలకొండలో కొండశిఖరంపైగల లక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని లక్ష్మక్కపేటగా పిలుస్తారు. ఇక్కడకు వచ్చిన భక్తులు అమ్మవారి ఆలయాన్ని తప్పనిసరిగా సందర్శిస్తారు. ఈ ఆలయంకు ఓ చరిత్ర ఉంది. నరసింహాస్వామి లక్ష్మీదేవితో మాలకొండలో పర్యటించే ఒకానొక సమయంలో స్వామివారు వేటకు వెళ్లారు. అక్కడ ఓ చెంచువనితను వరించినట్లు పురాణం చెప్తుంది. ఈ విషయం గమనించిన అమ్మవారు కోపోద్రిక్తులై అలకపూని కొండపైకి వెళ్తుండగా పెద్ద బండ రెండుగా బండ చీలి దారి ఇచ్చిందట. ఈ దారినే అమ్మవారు కొండ శిఖరముపైకి వెళ్లిందట. నేటికీ ఈ దారినే భక్తులు అమ్మవారి ఆలయంకు వెళ్తుంటారు. ఎంతటి స్థూలకాయులైన ఈ దారిన సునాయసంగా నడవడం ఇక్కడి ప్రత్యేకత.

**శనివారమే పూజలు ...ఎందుకంటే:** ఎక్కడా ఏ దేవాలయంలో లేనివిధంగా మాలకొండలో శనివారం ఒక్క రోజే భక్తుల దర్శనానికి అవకాశం ఉంది. మిగిలిన ఆరు రోజులు స్వామివారి తలుపులు మూసివేసిఉంటాయి. ఈ సమయంలో కొండపైన నిర్మానుష్యం. అటవీప్రదేశం కావడంతో జంతువులు నడయాడతుంటాయి. మునీశ్వరులు, దేవతలు పూజచేస్తుంటారని ప్రతీక. అగస్తమహాముని మాలకొండలో తపస్సుచేస్తూ ఈ మేరకు స్వామివారికి విజ్ఞప్తిచేసినట్లు పెద్దలు చెపుతారు. ముని వర్యుల కోరిక మేరకు స్వామివారు ప్రతి శనివారం మానవపూజకు కేటాయించినట్లు ప్రతీక.

**తిరుపతి మార్గదర్శకంగా ఉచిత అన్నదానం:** ప్రతి శనివారం మాలకొండలో నిర్వహించే ఉచిత అన్నదానం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. గతంలో ఆలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అయితే ఆ సమయంలో భోపే సిస్టంలో సుమారు నాలుగైదొందల మందికిలోపు వడ్డించే వారు. దీంతో వేలాది మంది బోజనానికి ఇబ్బందిపడేవారు. ఇటీవల కాలంలో శాసనసభ్యులు మహీధర్‌రెడ్డి సూచన మేరకు ఉచిత అన్నదానంలో సమూల మార్పులు చేపట్టారు. తిరుపతి దేవాలయం మార్గదర్శకంగా నిర్వహణలో మార్పులుచేపట్టారు. ఆలయ అధికారులే దర్శనానంతరం ఉచిత భోజనం, టిఫన్ కార్యక్రమం నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. నాణ్యతాప్రమాణాలు, శుచిశుభ్రతతో కూడిన టేబుల్ భోజనం ఏర్పాటుచేశారు. నిర్వహణకు సేవకులకు అవకాశం కల్పించారు. దీంతో పరిసర ప్రాంతాలలోని పలువురు సేవకులు అన్నప్రసాదాలను వడ్డిస్తుండడం గమనార్హం. ప్రతివారం సుమారు 6వేలమందికి పైగా అన్నప్రసాదాలు స్వీకరించి వెళ్తుంటారు. నిత్యం ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉండడంతో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం గమనార్హం.

**మాలకొండ అభివృద్ధికి కృషి-ఎమ్మెల్యే** మాలకొండ స్వామి మహిమాన్వితుడని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి అన్నారు. దేవాలయంలో భక్తుల రద్దీ నిరంతరంపెరుగుతుంది. స్వామివారి సేవలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. భక్తుల అవసరం మేర వసతులు మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా ప్రస్తుతం రూ.9కోట్ల నిధులుతో పలు అభివృద్ధిపనులు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. స్వామి వారి జయంతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామిరి కృపకు పాత్రలు కావాల్సిందిగా ఆయన భక్తులకు విజ్ఞప్తిచేశారు. స్వామివారిని పూజిస్తే సత్ఫలితాలు: కమీషనర్ ఈ నెల 6వ తేదీన స్వామి వారి జయంతి ఉత్సవాన్ని కందుకూరు శాసన సభ్యులు మరియు మాజీ మంత్రి వర్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆశీస్సులతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయకమీషనర్ కె.బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉత్సవాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన భక్తులకు సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జయంతి రోజున స్వామివారిని చిత్తశుద్ధితో పూజిస్తే సత్ఫలితాలుంటాయని ఆయన తెలిపారు. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలన్నారు. ఈ సందర్భంగా ఆలయసిబ్బంది నారాయణతోపాటు పలువురు ఉన్నారు.




# కావలి రైల్వే ఓవర్ బ్రిడ్జి శంఖుస్థాపనకు 14 ఏళ్లు !

## ముచ్చటగా మూడు శిలాఫలకాలు వేసిన ముగ్గురు ఎమ్మెల్యేలు !!

## పాలకుల అసమర్ధతలపై ధ్వజమెత్తుతున్న ప్రజలు !!!










**కావలి, మే 3 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని పెద్దపవని రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు శంఖుస్థాపన చేసి నేటికి 14 సంవత్సరాల రెండు నెలల పైబడింది. రైల్వే ట్రాక్‌పై రైల్వే శాఖ ఏనాడో బ్రిడ్జి నిర్మించింది. 14 ఏళ్ల క్రితం పెద్దపవని రోడ్డు నుంచి కావలి పట్టణానికి ప్రజల, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాలకుల అసమర్ధతపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. 2009 ఫిబ్రవరి 26వ తేది 31 కోట్ల రూపాయల అంచనాలతో కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ శంఖుస్థాపన గావించారు. ఆ కార్యక్రమంలో ఆనాటి మంత్రులు పనబాక లక్ష్మి, ఆనం రామనారాయణరెడ్డి, నేదురుమల్లి రాజ్యలక్ష్మి, తదితర పాలకులు, అధికారులు పాల్గొన్నారు. ఆ తర్వాత 2013 ఏప్రిల్ 22వ తేది ఆనాటి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు 31 కోట్ల రూపాయల అంచనాతో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనాటి మంత్రి రామనారాయణరెడ్డి, పితాని సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. వైసిపి పాలనలో 2019 డిసెంబరు 14వ తేది 43 కోట్ల రూపాయల అంచనాలతో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలు ముచ్చటగా సినిమా హాలు రోడ్డులో శిలఫలకాలు ఏర్పాటు చేశారు. అయినా బ్రిడ్జి నిర్మాణ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఇదిగో కాంట్రాక్టర్, అదిగో కాంట్రాక్టర్ రేపే పనులు ప్రారంభం అన్న మాటలు వినిపించడం తప్ప పని మాత్రం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు దుయ్యబడుతున్నారు. కావలి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కావలి పట్టణ ప్రజలు మరి ముఖ్యంగా విద్యార్థులు ఈ రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించాల్సి వుంది. బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని చెబుతూ రైల్వే గేటును మూసివేశారు. దీంతో 14 ఏళ్లగా ప్రజలు, విద్యార్థులు, వాహనచోదకులు పాలకుల, అధికారుల అసమర్ధతను ఎత్తిచూపుతున్నారు. ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసంస్థలు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం జరిగింది. నిన్నగాక మొన్న కావలి ఆర్‌అండ్‌బి కార్యాలయం వద్ద సిపియం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం కూడా జరిగింది. కావలి పట్టణ వెంకటేశ్వర థియేటర్ నుంచి వైకుంఠపురం, పెద్దపవని రోడ్డు వరకు ఆక్రమణలు తొలగించారు. యజమానులకు నష్టపరిహారం కూడా చెల్లించారు. మొదటి కాంట్రాక్టర్ పనులు ఆలస్యమయ్యాయని కాంట్రాక్ట్ గిట్టుబాటు కాదని వెళ్లిపోయినట్లు తెలుస్తుంది. ఇలా కాంట్రాక్టర్ల పేర్లు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. లేటెస్ట్‌గా ఓ కాంట్రాక్టర్ వచ్చారని 31 కోట్లది కాస్తా 43 కోట్లకు పెంచామని పాలకులు, అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, ఎమ్మెల్యేలు మారుతున్నారు, పోటీలు పడి వేసిన మూడు శిలఫలకాలు వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభిస్తే తప్ప కావలి ప్రజలకు నమ్మకం కలగదు. అంతవరకు పాలకుల మాటలు నీటి మూటలే, శంఖుస్థాపనల శిలాఫలకాలకే పరిమితమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## డిఎల్‌డివోచే సచివాలయం తనిఖీ

**బిట్రగుంట, మే 3 ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని పాతబిట్రగుంట సచివాలయాన్ని కావలి డివిజనల్ అభివృద్ధి అధికారిణి ఎస్.కనకదుర్గభవాని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆధార్ సెంటర్‌లోని ఆధార్ అప్‌డేట్ వివరాలు తెలుసుకోవడంతో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది విధిగా యూనిఫామ్ ధరించాలని ఆదేశించారు. విధులలో క్షేత్ర స్థాయి పర్యటనకు వెళితే రిజిష్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని లేనిపక్షంలో సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎంపిడివో సి.హెచ్.శ్రీదేవి పాల్గొన్నారు.

## ఆపదమిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ



**బిట్రగుంట, మే 3 ప్రభాతవార్త:** బోగోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆపదమిత్ర వాలంటీర్లకు కిట్లను ఎంపిపి మేకల సుజాత పంపిణీ చేశారు. విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణగా వుండేందుకు ఈ కిట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇన్‌చార్జ్ ఎంపిడివో శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో ప్రకృతి వైపరీత్యాలలో సహాయ పడేందుకు 18 మంది వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగిందని వీరంతా వెంకటాచలంలో తమ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కార్యాలయ సిబ్బంది, మండల వైసిపి యువత అధ్యక్షులు మేకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తహాశీల్దార్‌చే సచివాలయాల తనిఖీ



**బిట్రగుంట, మే 3 ప్రభాతవార్త:** బోగోలు మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహాశీల్దార్ పసుపులేటి హేమంత్‌కుమార్ బుధవారం బోగోలు మేజర్ పంచాయతీలోని బోగోలు 1, 3వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు రెవెన్యూ పరమైన ధృవీకరణ పత్రాలలో జాప్యం లేకుండా లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్న 24 గంటలలోగా వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూములకు సంబంధించి అడంగల్ సవరణ వంటి విషయాలలో కూడా అశ్రద్ధ వహించవద్దని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు వుంటాయని హెచ్చరికలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూలులో ప్రారంభమైన ఎన్‌సిసి శిక్షణ

**కావలి రూరల్, మే 3 ప్రభాతవార్త:** కావలి ముసునూరు జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా సమీపంలో వున్న ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషల్ స్కూలులో 500 మంది ఎన్‌సిసి క్యాడెట్లతో పది రోజుల పాటు జరిగే శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ శిక్షణా తరగతులకు లెఫ్టినల్ కల్నల్ సునీల్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లు ఈ శిక్షణలో ఎంతో శ్రద్ధగా పాల్గొని స్వీయ క్రమశిక్షణ అలవర్చుకోవాలని తెలిపారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన స్కూలు ప్రిన్సిపాల్ చంద్రజ్యోతి మాట్లాడుతూ భవిష్యత్‌లో సాధించాల్సి న లక్ష్యాల్ని ఎంచుకొని వాటిని సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. ఈ పది రోజుల పాటు ఆర్మీకి సంబంధించి అన్ని శిక్షణలు ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ రాజేష్‌కుమార్, ఎన్‌సిసి అధికారులు కె.బాలబ్రహ్మాచారి, వెంకటేశ్వర్లు, హరీష్‌రెడ్డి, జయరామ్, పెంచల పుల్లయ్య, ఆర్మీ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

**కావలి రూరల్, మే 3 ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పూల్ క్యాంప్, జిందాల్ స్టీల్ బెళ్లరీ వారిచే ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ ప్రియ తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల నుండి దాదాపు 65 మంది బాలురు. 7 మంది బాలికలు హాజరయ్యారని తెలిపారు. ఈ ఎంపికలు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 10వ తేది నుండి రాష్ట్రమంతా నిర్వహించారని తెలిపారు. 120 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాయగా 110 మంది పాసై ఇంటర్వ్యూకి ఎంపికయ్యారని తెలిపారు. వారిలో 72 మంది హాజరై గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్స్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా త్వరలో తెలియపరుస్తామని హెచ్‌ఆర్ మేనేజర్, జెఎస్‌డబ్ల్యు సివో తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల టిపివోలు బి.శివకుమార్‌రెడ్డి, వై.శ్రీనివాసరావు, రాజునాయక్, రవితేజలు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం తగదు



**కోవూరు, మే 3 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలో పనిచేసే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం తగదని ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి పని పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటించాలన్నారు. ఇటీవల కాలంలో కొంతమంది సచివాలయ ఉద్యోగులు ఆశించిన మేర సమయపాలన పాటించడం లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం చూపితే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం అందించే పథకాల విషయంలో పంచాయతీ కార్యదర్శులు కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ కల్పన మాట్లాడుతూ అన్ని పంచాయతీలు పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ముఖ్యంగా మంచి నీటి విషయంలో రక్షిత నీటి పథకాలను క్రమం తప్పకుండా క్లోరిన్ చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి సచివాలయంలో ఒక ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పన్నుల వసూళ్లలో కూడా నిర్లక్ష్యం చూపకుండా ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పాటించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా ప్రగతిపై సమీక్షించారు.

## నాడు-నేడు పనులు పరిశీలన



**సైదాపురం మే 3 ప్రభాతవార్త:** మండలపరిధిలోని చాగణం, మర్లపూడి, చీకవోలు, సైదాపురం గ్రామాలలో నాడు-నేడు పథకం ద్వారా జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపిపిఎస్ పాఠశాల భవన నిర్మాణ ,మరమ్మత్తుల పనులను ఎంపిడిఒ మీసాల వెంకటేశ్వర్లు, ఏఇ మృణాలినిఎంఇఒ దయాకర్‌రావు పరిశీలించారు. నిర్మాణం పనులు జూన్ మొదటి వారంలోపు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరడం జరిగిందని వారు తెలిపారు.

## క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలి



**కోవూరు, మే 3 ప్రభాతవార్త :** దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య వైద్యాదికారి డాక్టరన ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం ఆయన ఫ్యామిటీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల ఇంటింటికీ వెళ్లి వారికి తగు పరీక్షలు నిర్వహించి మందులు వాడుకోవడంతో పాటు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## రికార్డుల నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలి



**కోవూరు, మే 3 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలని డీఎల్‌డీఏ అధికారిణి వసుమతి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారానికి క్రమం తప్పకుండా పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చూపకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి పనిని బాధ్యతగా చేపట్టాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావు, ఉద్యోగులు ఉన్నారు.

## ఉక్కు పరిశ్రమకు మద్దతుగా రాస్తారోకో



**కోవూరు, మే 3 ప్రభాతవార్త :** కోవూరు బజార్ సెంటర్‌లో బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శేషయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అమ్మడం దారుణమన్నారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కుకు గ్రిడ్‌లు ప్రతిపాదన ముందుకు తీసుకువచ్చారన్నారు. విశాఖ ఉక్కు ఉదోనయగులు, కార్మికులు 810 రోజులుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన కొనసాగిస్తుంటే కేంద్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జీఎస్‌టీ పేరుతో ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్నారన్నారు. మన రాష్ట్రానికి రావాల్సి న విభజన హామీలు, ప్రత్యేక హోదా మాట ఊసే లేదన్నారు. మన రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు వ్యక్తిగత స్వార్థాలతో రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు గాలికి వదిలి మోడీ కాళ్లు మొక్కుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బుజ్జన్న , సురేష్, సురేంద్ర, భాస్కర్, ఖాదర్‌బాషా, తదితరులు ఉన్నారు.

## పచ్చళ్ళు ఊరగాయల తయారు విధానంపై శిక్షణ



**ముత్తుకూరు, మే3, ప్రభాతవార్త:** మహిళలకు పచ్చళ్ళు ఊరగాయల తయారీ విధానంపై ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పోర్టు లోని ఆదాని ఫౌండేషన్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ముత్తుకూరు మండలం చలివేంద్రం గ్రామానికి చెందిన పదిమంది మహిళలకు ఈ శిక్షణ ఇచ్చినట్లు ఆదాని ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆదాని ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేందేందుకు ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్చి వారి ఉపాధికి తోడ్పడుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. పచ్చళ్ళు ఊరగాయలు తయారీ విధానంపై శిక్షణ పూర్తిచేసుకున్న వారు స్వతహాగా తయారు చేసిన పచ్చళ్ళను మార్కెటింగ్ చేయడంలోనూ ఆదాని ఫౌండేషన్ సహాయసహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు, అనూష తదితరులు పాల్గొన్నారు.

## కాకర్ల ఆర్థికసహాయం



**సీతారామపురం మే 3ప్రభాతవార్త:** సీతారామపురం మండలంలోని పోలంగారి పల్లిలో కాకర్ల ట్రస్టు అదినేత కాకర్ల సురేష్ పర్యటించారు. పోలంగారిపల్లిలో పక్షవాతంతో బాదపడుతున్న బొల్లినేని వెంకటసుబ్బయ్యను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అలాగే సోంపల్లి గ్రామంలో గుండెపోటుతో బాధపడుతున్నటువంటి గడ్డం శ్రీనివాసులను అంగవైకల్యంతో బాధపడుతున్నటువంటి జమ్మలమడుగు ప్రకాష్‌కి, సీతారామపురం కేంద్రంలో పలువురికి ఆర్థిక సహాయం చేసి ధైర్యం చెప్పడం జరిగింది. ఈకార్యక్రమంలో కాకర్ల సురేష్ వెంట, ఎం.మదుసూదన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, బొల్లినేని వెంకటసుబ్బయ్య, ఎస్‌సి సెల్‌నాయకులు నేలటూరు జాషువా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిర్ అంబేద్కర్ మోడిని ప్రశంస్తాడని వ్యాఖ్యానించడం సరికాదు



**బుచ్చి మే 3 ప్రభాతవార్త:** భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవించి వుంటే ప్రధాని నరేంద్రమోడీ పాలన చూసి గర్వపడేవాడని సంగీత దర్శకుడు ఇళయరాజా రాసిన బుక్‌లో వ్యాఖ్యానించడం చాలా బాధకరమని ఆల్ ఇండియా ఎస్‌సి, ఎస్‌టి బిసి మైనార్టీ వెల్‌పేర్ అసోసియేషన్ రా ష్ట్ర అద్యక్షులు గంటా నరసింహులు బుచ్చిరెడ్డిపాలెంలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇళయరాజా అసలు పేరు డెవిడ్ రాజు అయితే పేరు మార్చుకొన్న ఆయన ఇలాంటి వ్యాఖ్యలు వ్రాయడం సరికాదని అన్నారు. ఈవిషయంతో సంగీతదర్శకుడు ఇళయరాజా ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. అంబేద్కర్‌జింకి బిజెపికి ఎక్కడ పొత్తు కుదరదని ఆవిషయాన్ని ఇళయరాజా తెలుసుకోవాలని చెప్పారు.

## అన్యాయంగా మాపైన కేసు పెట్టారు

**బుచ్చి మే 3 ప్రభాతవార్త:** తమపైన అన్యాయంగా కేసు పెట్టారని చెల్లాయపాళెంకి చెందిన తాండ్రహరికిరణ్, చెల్లాయపాళెం వైసిపి నాయకుడు వెంకయ్య ఆరోపించారు. చెల్లాయపాళెంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో తాండ్ర హరికిరణ్ మాట్లాడుతు ఇదే గ్రామానికి చెందిన శరణ్య నేను ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. కాని మొదటి నుండి నేను అంటే శరణ్య తల్లిదండ్రులకు ఇష్టంలేదు. మామద్య గొడవలు పెట్టి పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా పెట్టించారు. అయితే శరణ్యాతో విడాకులు తీసుకునేందుకు వారు కుటుంబసభ్యులు

**CHANGE OF NAME**
I, **Ms. SAYANA SAMEERA** (Old Name) W/o. Arlingam Harish Kumar, Door No.26-2-1302, Venkatareddy Nagar, Vedayapalem, Nellore-524004, SPSR NELLORE Dt, A.P. Declare that I have changed my name as **ARLINGAM LAKSHMI SAMEERA** (New Name).



10 లక్షలు డిమాండ్ చేయగా మేము 7 లక్షలు ఇస్తామని చెప్పాం. అందుకు వారికి ఇష్టం లేదు. ఖచ్చితంగా పదిలక్షలు ఇవ్వాలని అమ్మాయి పెదనాన మల్లికార్జున బెదిరించాడని ఆయన విలేఖర్ల వద్ద వాపోయాడు. గత వారం రోజుల క్రితం శరణ్య అమ్మగారి ఇంటి వద్ద నూనె వంటిపైన పోసుకొని నిప్పు అంటించుకుంటే నాపైన, నాతో ఉన్న పెద్ద మనుషులపైన అన్యాయంగా కేసు పెట్టారని హరికిరణ్ తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో నేను గ్రామంలో కూడా లేనని హరికిరణ్ అన్నాడు. అనంతరం వైసిపి నాయకులు కనిసిరి వెంకయ్య మాట్లాడుతు హరికిరణ్‌కి పెద్ద మనుషులుగా మేము వెళితే మాపైన కూడా కేసులు పెట్టడం ఎంత వరకు సమంజిసమని అని ఆయన ప్రశ్నించారు. అమ్మాయి వాళ్ల పెదనాన న తమ్మిరెడ్డి మల్లికార్జునకు మాకు పార్టీల పరంగా విబేధాలు ఉండడం వల్ల మాపైన కూడా కేసులు పెట్టించాడని వెంకయ్య ఆరోపించారు. పోలీసులు గ్రామంలోకి వచ్చి విచారిస్తే వాస్తవాలు తెలుస్తాయని వారు కోరారు.

## బావిలోని నీరును శుభ్రం చేయించిన అధికారులు



**సైదాపురం మే 3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెరుమాళ్లపాడు గ్రామంలో మురికినీరే-త్రాగునీరు అంటు బుధవారం " వార్త దినపత్రికలో "ప్రచరించడం జరిగింది. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు సురక్షిత మంచినీటి పథకం బావిలో క్లోరినేషన్ చేసి నీటిని శుభ్రపరిచారు. ఆర్‌డబ్ల్యుస్ ఏఇ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతు ప్రత్యామ్నాయ ంగా నీరు శుభ్రం చేయడం జరిగిందని స్పటికం నిర్వహిస్తామని పేర్కున్నారు.

## సమన్వయ సహకారంతో పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలి



**వింజమూరు, మే3ప్రభాతవార్త:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం , సహకారంతోనే పంచాయతీ అభివృద్ధి చెందుతుందని సిఇఒ చిరంజీవి పేర్కొన్నారు. బుధవారం వింజమూరు గ్రామ పంచాయతీని పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరిపాలన సక్రమంగా జరగాలంటే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మధ్య సమన్వయం ఉండాలన్నారు. ఇటీవల సర్పంచ్ నల్లగొండ్ల సృజన పంచాయతీ కార్యదర్శి వ్యవహార శైలిపై స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వింజమూరు వచ్చామన్నారు. ముందుగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యదర్శి, సర్పంచ్ మధ్య నెలకొన్న మనస్పర్థను గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచ్, కార్యదర్శి సమన్వయంతో ఉండి ప్రజా సంక్షేమంపై నిరంతరం దృష్టి కేంద్రీకరించాలని లేకుంటే పంచాయతీ పాలన కుంటుపడుతుందన్నారు. పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో జీతాలు అందజేయాలన్నారు. పంచాయతీ అభివృద్ధిలో భాగంగా కార్యదర్శి అభివృద్ధి, సంక్షేమం గురించి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్ళి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసన్నకుమారి, జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, నాయకులు మిడదాల రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఇకెవైసి చేసుకోవాలి

**బుచ్చి మే 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అందరు ఈనెల 9 వ తేదిలోగా ఇకెవైసి పూర్తి చేసుకోవాల్సిందిగా బుచ్చి సబ్ ట్రెజర్ అధికారి తెలియజేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అద్యక్షులు మాల్యాద్రి ,శ్రావణ్‌కుమార్ తెలిపారు. అందువల్ల ఇకెవైసి చేసుకొని బుచ్చి, సంగం, దగదర్తి మండలాల పెన్షనర్లు అందరు బుచ్చి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఇకెవైసి చేయించుకోవాలని వారు కోరారు. పెన్షనర్లు అందరు స్వయంగా లేదా వారి తరపు వారు ఆధార్‌కార్డు, మరియు ఆధార్ లింకు వున్న మొబైల్‌తో రావాలని వారు కోరారు. సబ్ ట్రెజరీతోపాటుగా వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ సమీంలోగల అద్యక్షులు ఎస్ మాల్యాద్రి ,బుచ్చిరెడ్డిపాళెం శాఖ వారి వద్ద కూడా ఇకెవైసి చేయడం జరుగుతుందని అన్నారు. వివరాలకు 9704995442 నెంబర్‌కి పోన్ చేయాలని అన్నారు.

## నోటీసులు ఉపసంహరించాలి -ఏపీటీఎఫ్

**వలేటివారిపాలెం మే 3, ప్రభాతవార్త:** పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియకు వెళ్లారనే నెపంతో పలువురు ఉపాధ్యాయ సంఘనేతలకు ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ ఏ.వీ.రావు, ఆర్.వి.కృష్ణమోహన్, సింహాద్రిలు ఆక్షేపించారు. నోటీసులును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నామినేషన్ ప్రక్రియలో5గురు ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్న విషయం ప్రభుత్వం గుర్తించకపోవడాన్ని వారు తప్పుపట్టారు. ఈ నేపద్యంలో రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, సీనియర్ నేతలు కె.కులశేఖర్‌రెడ్డి, జి.లక్ష్మయ్య తదితరులకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చి రాజ్యాంగసూ ్ఫర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారొక ప్రకటనలో పేర్కొన్నారు. శాసనమండలి చరిత్రలో మునుపెన్నడూలేనటువంటి నిబంధనలను తెరమీదకి తెచ్చి అభ్యర్థులను భయభ్రాంతులను చేయడం అప్రజాస్వామిక చర్యలని ఎద్దేవా చేశారు. నోటీసులు ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## మర్రిపాడులో ఆనం మాటా మంతి

**మర్రిపాడు, మే3ప్రభాతవార్త:** మర్రిపాడు మండల కేంద్రంలో ఆనం రామనారాయణరెడ్డి తమ అభిమానులతో కాసేపు ముచ్చటించారు. సొంత కార్యక్రమాలను ముగించుకొని హైదరాబాద్ నుండి నెల్లూరు వెళుతూ తిరుగు ప్రయాణ సమాచారం తెలుసుకున్న మర్రిపాడు మండలం ఆనం అభిమానులు భారీగా తరలివచ్చి ఆనం రామనారాయణరెడ్డితో మాటా మంతి జరిపారు. తన అభిమానుల ఆప్యాయ పలకరింపుకు ముగ్ధుడైన ఆనం రామనారాయణటెడ్డి తనపై పెంచుకున్న అభిమానానికి ధన్యుడనన్నారు. ఈకార్యక్రమంలో ఆనం ఆప్తుడు శాఖమూరి నారాయణనాయుడు, నూర్‌భాషా దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా, దుద్దుగంట శ్రీనివాసులురెడ్డి , ఆనం అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్, ఎస్పీలను సత్కరించిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, మే 3 ప్రభాతవార్త** బుధవారం కావలి పట్టణానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిలను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దుశ్సాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. సియం సభాస్థలి ఏర్పాట్లపై ఎమ్మెల్యే వారితో చర్చించారు. చుక్కల భూముల్ని తొలగించే కార్యక్రమాన్ని కావలిలో సియం జగన్ చేపడతారన్న విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉన్నతాధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసిన కావలి డిఎస్పీ




**కావలి, మే 3 ప్రభాతవార్త** సియం సభా ఏర్పాట్లపై పరిశీలించేందుకు బుధవారం కావలికి వచ్చిన జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి కావలి డిఎస్పీ వెంకట రమణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ నాగమల్లీశ్వరస్వామి దేవస్తాన భూముల వేలంపాట

**కలిగిరి,మే 3, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలోని వెలగపాడుగ్రామంలో వెలసి ఉన్న శ్రీనాగమల్లీ వ్వర స్వామి వారి దేవస్తాన భూములు ఒక సంవత్సరం కౌలకుసంభందించి 4వతేదీ గురువారం వెలగపా డులో నిర్వహించడంజరుగుతుందని ఆలయ య్యవస్థాపక ధర్మ కర్త యన్ .వి. రామక్రిష్ణ ఓ ప్రకట నలో తెలిపారు.వెలగపాడు గ్రామంలోని పాఠశాల ప్రాంగణంలో ఉదయం 10గంటలకు జరుగు ఈవేలం పాటలో ఆలయానికి చెందిన మాగాణి భుములు వేలం పాల నిర్వహించడం జరుగుతుందన్నారు.దేవాదాయ ధర్మాదాయ ఆదికారుల పర్యవేక్షణలో సంవత్సర కాలానికి జరుగు ఈ వేలం పాటలో పాల్గొన దలచినవారు. ముందుగారు. 2000లుదరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని ఏనిర్ణయానికైనా ఆలయ పాలక మండలికి అదికారాలుయుంటాయన్నారు.

## బహిరంగ ప్రవేశాల్లో చెత్తను వేస్తే స్ధానికులకు జరిమానాలు

**నెల్లూరు కార్పొరేషన్,మే3,ప్రభాతవార్త**



క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టుడోర్ చెత్త సేకరణకు ప్రజలంతా సహక రించాలని,బహిరంగంగా వ్యర్థాలు వేస్తే వీధిలోని స్థానికులందరికీ జరిమానాలు విధిస్తామని కమిషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు.స్థానిక 7వ డివిజన్ తోటబడి, 8వ డివిజ్ తడికెల బజార్ ప్రాంతాల్లోని శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను కమిషనర్ బుధవారం ఉదయం 6గంటలకు తనిఖీ చేశారు.డివిజన్ పరిధిలోని శానిటేషన్ సిబ్బంది హాజ రును కమిషనర్ పరిశీలించారు.ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు అయ్యే సిబ్బందికి షోకా జ్ నోటీసులు జారీ చేయాలని,నోటీసులకు జవాబు ఇవ్వని సిబ్బందినివిధుల నుంచి తొలగించాలని ఎమ్ .హెచ్.ఓను ఆదేశించారు.మెడికల్ సెలవుల మంజూరుకై అధికారిక మెడికల్ బోర్డు ఆసుపత్రుల సర్టిఫికెట్‌లను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.అనంతరం 7/1 డివిజన్ సచివాలయ పరి ధిలో ఎన్.వి.ఎస్ కళ్యాణ మండపం సమీపంలో వీధిలో పేరుకున్న చెత్తను గమనించిన కమిషనర్‌స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా మాట్లాడి బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని హెచ్చరించారు.ఆదేవిధంగా చెత్తసే కరణ యూజర్ చార్జీలు 90నుంచి 40రూ తగ్గించినందున ప్రతిఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కోరా రు. యూజర్ చార్జీల చెల్లింపుకై శనివారం నాడు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని,నగరపాలక సంస్థ పరిధి . లోని 54 డివిజన్ల ప్రజలు బాధ్యతగా చెల్లించాలని కమిషనర్ కోరారు.యూజర్ చార్జీల చెల్లింపులను పర్య వేక్షిస్తారని తెలిపారు.ప్రత్యేక డ్రైవ్‌ను కమిషనర్ స్వయంగా సందర్శించి యూజర్ చార్జీల చెల్లింపులను పర్యవేక్షిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి,సూపర్వైజర్లు,సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామ సీతలనాభిశిల ప్రతిష్ట మహోత్సవం

**సైదాపురం మే 3 ప్రభాతవార్త** సైదాపురం పంచాయితీ పరిధిలోని మొలకల పూండ్ల గ్రామ హరిజనవాడలో గ్రామ సీతల నాభిశిల ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దాత మాజీ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లు రెడ్డి నూతనంగా నిర్మించిన రామమందిరంలో విశేష పూజలు నిర్వహించారు.అనంతరం హోమం,గ్రామోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేశారు.ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన జెడి సుధాకర్‌రాజు

**అల్లూరు, మే 3 ప్రభాతవార్త** అల్లూరు మండలంలోని పురిణి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం నెల్లూరు జిల్లా అగ్రికల్చర్ జెడి సుధాకర్‌రాజు తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రంలో పలు రికార్డులను, రిజిష్టర్‌లను పరిశీలించారు. పియం కిసాన్‌కు అర్హులైన రైతులందరూ ఈకెవైసి నమోదు చేసుకోవాలని చెప్పారు.ఈయన వెంట మండల వ్యవసాయాధికారి వేణుగోపాలరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ మనోహర్, ఆర్‌బికె రైతు మిత్ర క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయితీరాజ్ దినోత్సవం

ఉదయగిరి మే 3 ప్రభాతవార్తఉదయగిరి మండల పరిషత్ కార్యలయంలో బుధవారం జరిగిన జాతీయ పంచాయితీరాజ్ దినతో ్సవం సందర్భంగాజిలా ్ల స్ధాయిలో వచ్చిన అవార్డులకు గాను సమావేశం నిర్వహించారు.ఈ సందర ్భంగా ఎంపిడిఒ హైజాక్ ప్రవీణ్ మాట్లాడుతు మండల పరిధిలోని వెంగాలరావునగర్ గ్రామ పంచాయితీకి పేదరికె నిర్మూలన అనే అంశం నందు అవార్డు వచ్చినందున పంచాయితీ కార్యదర్శి షేక్ హంచే హీనా మరియు సర్పంచ్ తిరుపతి డిడిఒ కార్యదర్శి అమర్ ను మండల పంచాయితీ కార్యాలయంలో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండల పరిధిలో అవార్డు రావడం ఆనందంగా ఉందని తెలిపారు.అలాగే మిగతా పంచాయితీలు కూడా అన్ని విభాగాలలో జాతీయ స్ధాయి రాష్ట్ర స్ధాయి అవార్డుల సాధించే విధంగా కృషి చేయాలని కోరారు.ఎఒ రేణుక, జూనియర్ అసిస్టెంట్ గౌస్ అహ్మద్,పంచాయితీ కార్యదర్శులు మండల కో ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్,తదితరులు పాల్గోన్నారు.

## పిఎంశ్రీ పథకానికి బివిఎన్‌ఆర్ జడ్‌పి హైస్కూల్ ఎంపిక

కలువాయి మే 3 ప్రభాతవార్త పిఎంశ్రీ పథకానికి కలువాయిలోని బులగాకుల వెంకటనరసారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ ఎంపికైనట్లుమండల విద్యాధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో ప్రక్షాళన చేస్తుండగా ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా చేయూత అందించేందుకు పిఎంశ్రీ పథకం ద్వారా సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టిందని ఎంఇఒ తెలిపారు. పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు ఎస్ జనార్ధన్‌రెడ్డి ఆద్వర్యంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.తల్లిదండ్రులకు పిల్లల ప్రగతిని తెలిపే ప్రోగ్రస్ కార్డులను అందజేశారు.నూతన విద్యా విధానం అమలు చేసే కార్యక్రమంలో బాగంగా ప్రధానమంత్రి స్కూల్ పర్‌రైజింగ్ ఇండియా పథకాన్ని అమలు లోకి తీసుకొని వచ్చిందని ఈ పథకం ద్వారా జిల్లాలో 28 పాఠశాలలు ఎంపిక కాగా అందులో బివిఎన్‌ఆర్ జడ్‌పి హైస్కూల్‌కి అవకాశం కలగడం హర్షించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈకార్యక్రమంలో పేరెంట్స్ కమీటి చైర్మన్ కె అంకయ్య,సిఆర్‌పి మహేశ్వర్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## ప్రజల సంక్షేమమే జగనన్న లక్ష్యం

మర్రిపాడు, మే3ప్రభాతవార్త: మర్రిపాడు మండలం పల్లవోలు సచివాలయం పరిధిలోని తిక్కవరంలో గడపంగడపడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి స్థానిక నాయకులు , ప్రజా ప్రతినిధులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి అందించే సంక్షేమ పథకాలన్ని అందాయా లేదా అని తెలుసుకున్నారు. చుక్కల భూముల సమస్య ఉందని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలపడంతో ముఖ్యమంత్రి పరిష్కరించేందుకు జిఒ విడుదల చేశారన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యల ఏకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హైలెవల్ కెనాల్ ద్వారా తమ గ్రామానికి నీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను పలువురు కోరడంతో పనులు జరుగుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండరాదని ప్రతి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయమై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. చిన్న చిన్న సమస్యల వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో కోట్లాది రూపాయల సంక్షేమం , అభివృద్ధికోసం నిధులు అందచేస్తున్నారని ప్రతి ఒక్కరూ మరోమారు జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కోరారు.

## డిగ్రీ ఫలితాల్లో జెనెక్స్ విద్యార్థుల హవా



**నెల్లూరు,మే3 ప్రభాతవార్త-విద్య** విక్రమసింహపురి యూనివర్శిటీ బుధవారం విడుదల చేసిన డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని స్థానిక హరినాధపురం జెనెక్స్‌డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబరిచి వారి హవాను కొనసాగించారు. డిసిఏ డిఎస్ విభాగంలో షేక్.మీరా జాస్మిన్ 9.72 జిపిఏ ఎస్‌డి.మసిరా అన్‌జుమ్9.67 జిపిఏ, పి.సాయి లహరిలు 9.48 జిపిఏ లు సాధించి సత్తా చాటారు. బిసిఏ జనరల్ విభాగంలో షేక్.సుహేల్9.79, బి.రోహన్9.33, పి.వినిత 9.30 జిపిఏ సాధించారు. బికాం విభాగంలో ఏ.అవంతి 9.85, ఆర్.మనోజ్9.60, వి.షిర్లీ9.50 ప్రతిభ చాటారు. బిబిఏలో ఎస్.సౌమ్యశ్రీ 9.79 , పి.జహీదా సుల్తానా 9.73, పి.వెంకటలక్ష్మీ 9.63,లు సాధించారు. బిబిఏ జనరల్ విభాగంలో ఏ.తేజశ్విని 9.27, ఎం.వెంకటమధుమిత9.27, వి.రజిత9.27లు సాధించారు.ఈ సందర్భంగా స్థానిక కళా శాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జెనెక్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, పి.కొండలరావులు మాట్లాడుతు తమ విద్యార్థులు అన్నీ పరీక్షల్లో యూ నివర్శిటీ ప్రదమ ర్యాంకులు సాధించటం గర్వకారణమన్నారు. ఉత్తమ అధ్యాపకులచే సులభతరమైన విధం గా విద్యాబోధన చేయటం ద్వారా ఇంతటి విజయాలు సాధించగలిగామని పేర్కొన్నారు. ఈ విజయానికి కారుకులైన వారికి వారు అభినందనలను తెలిపారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పు ష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జే.అనిల్ కుమార్, అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెఈఈ మెయిన్స్‌లో ఆకాష్‌బైజూస్ విద్యార్థుల ప్రతిభ

**నెల్లూరు,మే3 ప్రభాతవార్త-విద్య** ఎన్‌టిఏ విడుదల చేసిన జెఈఈ మెయిన్స్-2023 ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు కైవశం చేసుకోవటం సంతోషంగా ఉందని ఆకాష్‌బైజూస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అభిషేక్ మహేశ్వరి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక ఆకాష్ సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నగరానికి చెందిన తమ విద్యార్థులు అశోక్99.40 పర్సంటైల్స్‌ను సాధించారని, అలాగే వి.సుశాంత్ 99.06 పర్సంటైల్స్ సాధించారన్నారు. జాతీయస్థాయిలో ఈ ర్యాంకులు తమ విద్యార్థులు కైవశం చేసుకోవటం గర్వకారణమన్నారు. ఎంతో కష్టతమైన జెఈఈ పరీక్షల్లో తాము రూపొందించిన అకడమిక్ ప్రోగ్రామ్‌ద్వారా సాధారణ విద్యార్థులకు కూడా అసాదారణ ప్రతిభావంతులుగా మారుతున్నారన్నారు. ప్రస్తుతం జాతీయస్థాయిలో మంచి ఫలితాలు సాధించిన వీరు రానున్న రోజులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సీహెచ్‌ఓలకు జీతాలు పెంచాలి



**నెల్లూరు మే 3 ప్రభాతవార్త-వైద్యం** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న సీహెచ్‌ఓలకు కూడా వేతనం హైక్ చేయాలని ఎంఎల్‌హెచ్‌పి అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శిరిగిరెడ్డి. అనిత విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.పెంచలయ్యకి అసోసియేషన్‌కు చెందిన పలువురు నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలోని విభాగాలకు చెందిన ఉద్యోగులకు వేతనం హైక్ చేశారన్నారు. కేవలం తమ సీహెచ్‌ఓలకు మాత్రమే వేతనం పెంచలేదన్నారు. అంతే కాకుండా తమకు మాత్రమే ప్రతి ఏడాది 5శాతం ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్ సైతం ఇవ్వడం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో ఎఎన్‌ఎంలకు రూ.27వేలు కేవలం స్టాఫ్ నర్సులకు రూ.32వేలు ఇస్తున్నారన్నారు. వారికన్నా ఉన్నత చదువులు చదివిన తమకు మాత్రం జీతాలు పెంచకపోవడం బాదాకరమన్నారు. తమకు నెల జీతాలతోపాటు ఇన్సెంటివ్స్ అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమకు ఫిక్స్‌డే పే జరిగేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సి అసోసియేషన్ జిల్లా నాయకురాళ్ళు కృష్ణవేణి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సభ్యురాలు ఆర్థిక స్వాలంభనే ప్రధానలక్ష్యం

**వింజమూరు, మే3 ప్రభాతవార్త:**



పొదుపు గ్రూపులోని ప్రతి సభ్యురాలు ఆర్థిక స్వాలంభన ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం గ్రూపులను ప్రోత్సహిస్తుందని డిఆర్‌డిఎ పిడి కొంకల సాంబశివారెడ్డి పేర్కొన్నారు. వింజమూరు లోని కావలి-కడప మెయిన్‌రోడ్డు ఎదురుగా ఉన్న చేయూత మహిళామార్ట్‌ను బుధవారం ఆయన పరి శీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు రెండు చేయూత మహిళామార్ట్‌లు మం జూరయ్యాయని ఒకటి కందుకూరులో ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. రెండవది వింజమూరులో ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో చేయూత మార్ట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. ఈ మార్ట్ ఉద్దేశం ప్రతి గ్రూపులోని సభ్యురాలిని భాగస్వామిని చేయడం, వారికి ఆర్థికస్వాలంభన కల్పించడమే నన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసే మార్ట్‌ల్లో నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకే లభిస్తాయన్నారు. వింజమూరు మండలంలో 860మహిళా సంఘాల పొదుపు గ్రూపులు ఉన్నాయని వాటిలో 775గ్రూపులు 80శాతం కు పైగా మహిళామార్ట్ సభ్యులుగా 200రూపాయలు పెట్టుబడి నగదు , 10రూపాయలు సభ్యత్వం చెల్లించి భాగస్వాములయ్యారన్నారు. ఈమార్ట్ నిర్వహణ 11మంది బోర్డు సభ్యులను ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం మార్ట్‌లో పనిచేసేందుకు ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు, ఒక స్వీపరును నియమించామన్నారు. ఈకార్యక్రమంలో ఎపిఎం శాలిన్‌రోజ్, సిసిలు పార్వతి, సునీత, ఇఒఎ శ్రీదేవి, సిబ్బంది రవీంద్ర, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు ప్రారంభం



వింజమూరు,మే3ప్రభాతవార్త: వింజమూరు మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి పర్వతంపై కొలువుదీరి ఉన్న శ్రీగుహమల్లీశ్వర , శ్రీలక్ష్మీనర్సింహుని బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంకురార్పణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నుండి ప్రారంభమైన ఉత్సవాలు 10వ తేదీ బుధవారంతో ముగియనున్నాయి. అంకురార్పణ ఉభయకర్తలుగా అంకినపల్లి శివశంకర్‌రెడ్డి-నీలివేణి , వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రంగురంగుల విద్యుత్‌దీపాలంకరణతో దేదీప్యమానంగా తీర్చిదిద్దిన ఆలయంలో విశేషపుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి , ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబులురెడ్డి, మాజీ పాలకమండలి చైర్మెన్ అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి, నాయకులు గణపం బాలకృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, రేవనూరు శ్రీనివాసులురెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, చీమల వెంకటరత్నారెడ్డి, భూమిరెడ్డి పెంచలరెడ్డి, ఎంపిటిసి సభ్యులు ఉంటా రత్నమ్మ, అంకినపల్లి పెంచలరెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, మద్దూరి రాజగోపాల్‌రెడ్డి , అన్నపురెరడ్డి మాలకొండారెడ్డి, బంధువులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## మర్రిపాడులో వర్షం

మర్రిపాడు,మే3ప్రభాతవార్త: మర్రిపాడు మండల పరిధిలోని పొంగూరు,నందవరం, రాంపల్లి, రామానాయుడుపల్లి, డిసిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకొని తేలికపాటి వర్షం పడిం ది. మరికొన్ని గ్రామాల్లో గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో గత కొది ్దరోజులుగా తీవ్ర ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని బుధవారం వర్షం పడడంతో వృద్ధులు ,పిల్లలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు .

## చిన్నారులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

**వింజమూరు,మే3ప్రభాతవార్త:**



వింజమూరులోని మెయిన్‌రోడ్డు లోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ భవంతిపై నూతనంగా ఏర్పాటు చేసిన సాయిబాలాజీ చిన్నపిల్లల , జనరల్ ఆసుపత్రిని బుధవారం పురప్రముఖులచే అట్టహాసంగా ప్రారంభించారు.ఈసందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వాహకులు , వైద్యులు డాక్టర్ వెంకటేష్ అధునాతన వైద్యపరికరాలు, వసతులతో 24గంటలు అందుబాటులో ఉండేలా పట్టణంలో నూతన హాస్పెటల్‌ను నెలకొల్పడం శుభపరిణామమన్నారు. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న వింజమూరుమండలంలో ఇలాంటి అధునాతనమైన వైద్యశాలను ఏర్పాటు చేసి తక్కువ ఫీజులతో చిన్నారులకు వైద్యసేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ్య చిన్నవైద్యనిపుణులు డాక్టర్ మాశిలామణి, జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, ప్రజా వైద్యశాల వైద్యులు శేషగిరి రావ్ పాల్గొన్నారు.

## నల్లగొండ్లలో ధ్వజారోహణ



వింజమూరు, మే3ప్రభాతవార్త:వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలోని నీలగిరి పర్వతంపై వెలసియున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2వరోజు ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చేజర్ల చలమారెడ్డి-మాధవి, అంకినపల్లి ఓబులురెడ్డి-గిరిజమ్మ దంపతులు వ్యవహరించారు. ఉభయకర్తలు స్వగ్రామం నుండి మేళతాళాలు, మంగళవాయిధ్యాలు, భాజా భజంత్రీల మధ్య ఉభయాన్ని తెచ్చారు. ఆలయ ప్రధానార్చకులు పరంకుశం సత్యనారాయణాచార్యులు , తిరుమలతిరుపతి దేవస్థాన వేదపండితులు ముందుగా ధ్వజానికి గరుట్మంతుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సృష్టిలోని 33కోట్ల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవానికి ఆహ్వానం తెలియజేస్తూ ఈ గరుట్మంతుని పంపుతున్నట్లు సంకేతమన్నారు. గరుట్మంతుని ఆహ్వానం మేరకు సకల దేవతలు ఆలయానికి చేరుకొని వారి ఆశీస్సులు తెలియజేస్తారని అర్చకులు తెలిపారు. ఈసందర్భంగా తయారు చేసిన గరుడముద్దలను ధ్వజస్థంభానికి సమర్పించారు. ఈముద్దలను సంతానం లేనివారు తింటే సంతానం కలుగుతుందని నమ్మకం. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అధోగతిపాలుచేసిన వైకాపా ప్రభుత్వం

**వింజమూరు,మే3ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ప్రస్తుతం పాలనలో ఉన్న వైసిపి ప్రభుత్వం నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక్కచాన్స్ ఇవ్వండంటూ ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి నేడు రాష్ట్రాన్ని అదోగతిపాలు చేస్తున్నారని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరా మారావు పేర్కొన్నారు. బుధ వారం మండలంలోని ఊటుకూరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు .గ్రామంలో ఇంటింటికి వెళ్ళి సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనను దుయ్యబట్టారు. ఈసందర్భంగా బొల్లినేని వెంకటరామారావు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రజలు ఒక్కచాన్స్ ఇస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎలా నాశనం చేశాడో ప్రజలు గమనించాలన్నారు. వైసిపి ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వ కట్టడాలు కూల్చడాలు, ప్రతిపక్షాలపై కక్షబూనడం తప్ప రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. రాజధాని అడ్రస్‌లేకుండా నిలువునా రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశాడన్నారు. ఆకాశాన్నంటిని ధరలు, విపరీతంగా పెరిగిన విద్యుత్, ఆర్టీసి చార్జీలతో ప్రజలు చితికిపోయారని బొల్లినేని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తక్కెళ్ళపాడులో టిడిపికి చెందిన పార్లమెంట్ ఎస్సీ సెల్ నాయకులు అంకిపెద్దన్న వివాహ వేడు కల్లో పాల్గొని నూతన జంటను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గొంగటి రఘు నాధరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు కొండ పల్లి వెంకటేశ్వర్లు, కోదూరు నాగిరెడ్డి, చల్లా శ్రీనివాసులు, నాగభూషణం, అంచూరు శ్రీనివాసులు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 30 లక్షలతో కెఎన్‌ఆర్ అతిధి గృహం ప్రారంభం



**రాపూరు మే 3 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో కెఎన్‌ఆర్ నిర్మాణ సంస్థ 30 లక్షల వ్యయంతో నేర్మించిన ఏసి అతిధి గృహాన్ని బుధవారం ఆలయ చైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి,ఇఒ కె జనార్ద న్‌రెడ్డి,సంస్థ పిఆర్‌ఒ ఎం కోటిరెడ్డిలు పూజలు నిర్వహించి లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పిఆర్‌ఒ కోటిరెడ్డి మాట్లాడుతు కెఎన్‌ఆర్ సంస్థ పెంచలకోనకు వచ్చే భక్తుల సౌకర్యార్ధం 30 లక్షల వ్యయంతో ఈ అతిధి గృహాన్ని నిర్మించినట్లు తెలిపారు.బ్రహ్మోత్సవాల సందర ్భంగా దీనిని వాడుకునేందు నిర్మాణం పూర్తి అయిన ఈ భవనాన్ని ఆలయానికి అప్పగించినట్లు తెలిపారు. అతిధి గృహాన్ని ఆలయానికి అప్పగించిన కెఎన్‌ఆర్ పిఆర్‌ఒ కోటిరెడ్డికి చైర్మన్ ఇఒలు శాలువా కప్పి సన్మానించి స్వామి వారి తీర్ద ప్రసాదాలు అందజేశారు.

## ఎనెల్ ఆసుపత్రికి విచ్చేసిన డిఆర్‌డిఓ చైర్మన్ సతీష్‌రెడ్డి



**నెల్లూరు మే 3, ప్రభాతవార్త-వైద్యం** రూరల్ నియోజకవర్గంలో పరిధిలో ఉన్న ఎనెల్ ఆసుపత్రికి డీఆర్‌డీఓ చైర్మన్, సైంటిఫిక్ అడ్వయిజర్ డాక్టర్ గుండ్రా.సతీష్‌రెడ్డి బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎనెల్ ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించి ఆయన సంతృప్తిని వ్యక్త పరిచారు. ఎనెల్‌లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను చూసి ఆ ఆసుపత్రి యాజయాన్యాని కొనియాడారు. ఆసుపత్రి యాజమాన్యం సతీష్‌రెడ్డిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎనెల్ ఆసుపత్రిలో సామాన్యులకు సైతం రోగులకు వైద్యం అందిచడంలో అన్ని అధునాతన వసతులు కలిగి 24గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ అందిస్తున్న సేవలు నగరానికే కాక జిల్లావాసులకు ఎంతో ఉపయోగకరంగా ఇక్కడ వైద్యం ఉందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ఆసుపత్రి చైర్మన్ ధశరధ. నాగేంద్ర ప్రసాద్, ప్రముఖ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కులారి.నాగేంద్రప్రసాద్, ఆ ఆసుప్రతి సెంటర్ హెడ్ రవికుమార్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రణీత్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన డీపీఓగా సుస్మిత నియామకం



నెల్లూరు అర్బన్,మే3,ప్రభాతవార్త నెల్లూరు జిల్లా నూతన జిల్లా పంచాయతీ అధికారిగా ఎం.సుస్మిత బుధవారం బాధ్యతల తీసుకు న్నారు.గతంలోపలు మండలాల్లో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బుధవారం శాశ్వత పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.ఇంచార్జి డిపిఓగా బి.చిరంజీవి బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసినదే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎం.సుస్మిత బాధ్యతలు స్వీకరించారు.